ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



స్థానికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు మంగళవారం వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, సంక్షేమ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఏఈ సాగర్

కుత్బుల్లాపూర్: రంగారెడ్డి నగర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రణాళికలతో ముందుకెళ్తూ పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని గాజులరామారం సర్కిల్ ఏఈ సాగర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో వచ్చిన ఫిర్యాదులతోపాటు ఎమ్మెల్యే, కార్పొరేటర్ సూచనలతో ఆయా ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, మురుగు కాలువల విషయంపై ఎప్పటికప్పుడు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. తాము ప్రణాళికలు రూపొందించిన పనుల విషయంపై ప్రత్యేకంగా గ్రేటర్ నుంచి స్పెషల్ సర్వే నిర్వహించి అక్కడ పనులు అత్యవసరమా...కాదా.. అన్న విషయంపై క్లారిటీ వచ్చిన తర్వాతనే పనులకు టెండర్లు నిర్వహిస్తామని తెలిపారు. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండు నెలలుగా డివిజన్‌లో అన్ని కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నానని తెలిపారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు



సుభాష్‌నగర్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 23న విజిన్ మార్షల్‌ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మాస్టర్ జగదీష్ నేతృత్వంలో రిత్విక్, యశ్వత్, యొనోస్ గోల్డ్ మెడల్స్, అభిలాష్, రేవంత్, జోత్స్న సిల్వర్, భాను, భరత్‌లు బ్రాంజ్ మెడల్స్ సాధించారు.

స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 10 మంది మైనర్లు

వాహనాలను సీజ్ చేసిన ట్రాఫిక్ పోలీసులు



కుత్బుల్లాపూర్: మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. మంగళవారం అల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో సీఐ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కొంపల్లిలోని గాంధీ విగ్రహం, జీడిమెట్ల రోడ్డులో పలు వాహనాలను తనిఖీలు చేశారు. వాహనాలు నడుపుతూ 10 మంది మైనర్లు, హెల్మెట్‌లు ధరించని, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని మరో ఐదుగురు పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసి వారి వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

మసీదుల వద్ద సౌకర్యాలు కల్పించాలి



చింతల్: రంజాన్ నేపథ్యంలో మసీదుల వద్ద వీధి దీపాలు, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కాంగ్రెస్ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్ కోరారు. మంగళవారం కుత్బుల్లాపూర్ ఉపకమిషనర్ నరసింహకు మసీదు కమిటీ నాయకులతో కలిసి సమస్యలు వివరించారు. పరిసర ప్రాంతాలను కూడా శుభ్రం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసద్, అబ్దుల్ ఖాదర్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతి

కుత్బుల్లాపూర్: భవనంపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గుండ్ల పోచంపల్లి ఓం శ్రీ గెలాకీ అపార్ట్‌మెంట్ డీ- బ్లాక్‌లోని రెండవ అంతస్తులో మంగళవారం పనులు చేస్తుండగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్రీనాథ్(25) మద్యం మత్తులో జారి పడ్డాడు. భవనం రేలింగ్ వాల్‌కు ఉన్న ఇనుప సీకులు గొంతుకు గుచ్చుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి కార్మికుడు దినేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సర్కిల్ కార్యాలయంలో.. నిర్వహణ నిల్!

• పగిలిన టైల్స్ • ధ్వంసమైన కిటికీల అద్దాలు • పట్టించుకోని అధికారులు





సంవత్సరాల తరబడి ప్రధాన ద్వారం వద్ద ఉన్న అల్మారాలు

టౌన్ ప్లానింగ్ గదిలో పగిలిన టైల్స్



కుత్బుల్లాపూర్: సర్కిల్ కార్యాలయంలో నిర్వహణ లేక ఉద్యోగులు సతమతం అవుతున్నారు. వివిధ సమస్యలపై అధికారులకు విన్నవించడానికి వచ్చే ప్రజలకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లో సమస్యలుంటే అధికారులకు ఫిర్యాదు చేసి పరిష్కరించుకుంటారు. సమస్యలు పరిష్కరించే అధికారుల కార్యాలయాల్లోని సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. మూత్ర శాలలు కూడా సరిగా లేవు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులు కార్యాలయంలోని ఆయా సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. మొదటి అంతస్తులోని టౌన్ ప్లానింగ్ విభాగం గదిలోని కొన్ని టైల్స్ పగిలిపోయాయి. దీంతో కార్యాలయం లోనికి వచ్చి వెళ్లే క్రమంలో పగిలిన బండల ప్రాంతంలో కాళ్లకు గుచ్చుకుంటున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నిత్యం కార్యాలయానికి వచ్చే ప్రజలకు మూత్రశాల అవసరం. ఈ కార్యాలయంలో ఉండే మూత్రశాలలు ఎందుకు పనికి రాకుండా పోయాయి. నిర్వహణ సరిగా లేక దుర్వాసన వస్తుంది. నాసిరకం పరికరాలు ఏర్పాటు చేయడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. అదేవిధంగా కొన్ని సంవత్సరాలుగా ప్రధాన ద్వారం వద్ద అల్మారాలు అక్కడే ఉంటున్నాయి.

◆ ఇతర గదుల్లో పెట్టడానికి అవకాశం ఉన్నప్పటికీ ప్రధాన ద్వారం నుంచి తొలగించడం లేదు. ప్రధాన ద్వారం వద్ద బీరువాలు ఉండటంతో వచ్చి వెళ్లే వారికి ఇబ్బందిగా ఉంది. అసలే దారి చిన్నగా ఉంటుంది. చిన్నచిన్న మరమ్మతులు చేస్తే పరిష్కారం అయ్యే ఈ పనులకు కాలయాపన చేయడం ఎందుకని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయంలో నిసమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రణాళికలు రూపొందించాం

సర్కిల్ కార్యాలయంలో వివిధ మరమ్మతుల కోసం రూ. 7 లక్షల నిధులు అవసరం. ప్రణాళికలు రూపొందించాం. కేవలం రూ.3 లక్షలు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. వాటితో అధికారుల ఆదేశాలతో పనులు ప్రారంభిస్తాం.

– లక్ష్మీ గణేష్, సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్.

అనాలోచిత నిర్ణయాల వల్లే నీటి కష్టాలు

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు ముందు చూపులేకపోవడం వల్లే నీటి కొరత ఏర్పడిందని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. నిజాంపేట కార్పొరేషన్ పరిధిలోని ట్యాంకర్ల యజమానులు, డ్రైవర్లు తాము ఎదుర్కొంటున్న సమస్యలను మంగళవారం ఆయనకు వివరించారు. దీనిపై స్పందించి ఆయన మాట్లాడుతూ.. మోటార్లకు మీటర్లు పెట్టాలని ఒత్తిడి తేవడం, ట్యాంకర్లకు అదనంగా ఫీజులు కట్టాలని బెదిరించడం ఏంటని ప్రశ్నించారు. ట్యాంకర్ల యజమానులు వేల రూపాయల డిపాజిట్లు కట్టాలని ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. వేసవి కాలంలో నీటి కొరత ఏర్పడిన తరుణంలో విధించిన ఆంక్షలు ప్రజలకు మరిన్ని నీటి కష్టాలకు కారణం అవుతోందన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన సంక్షేమ సంఘం నేతలు

జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మనగర్ బి బ్లాక్ నూతన సంక్షేమ సంఘం సభ్యులు కార్పొరేటర్ కె.జగన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిశారు.



ఎమ్మెల్సీతో మైసమ్మనగర్ బి బ్లాక్ సంక్షేమ సంఘం సభ్యులు

నూతన కమిటీని ఆయన సన్మానించారు. మైసమ్మనగర్ అభివృద్ధి కోసం పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు సి.బసవప్ప, ప్రధాన కార్యదర్శి బండారి రవీందర్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ యాదవ్, బస్తీ పెద్దలు పాపిరెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, ప్రవీణ్, కురుమారెడ్డి, రాజయ్య, చంద్రయ్య, సంగమేష్, రమేష్‌చారి, సంతోష్, శ్రీనివాస్, ప్రేమ్ సాయి, సాయి కిరణ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

బస్టాప్‌ను పునరుద్ధరించాలి

నిజాంపేట్: రాజీవ్ గాంధీ నగర్ మెయిన్ రోడ్డు కేపీఎస్ ఫ్రెష్ ఉమా హైట్స్ ముందు ఉన్న బస్టాప్‌ను కొంతమంది ఆక్రమించి షాపులు నిర్వహిస్తున్నారని, ప్రజా అవసరాల కొరకు బస్టాప్‌ను పునరుద్ధరించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలను గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో గల 16, 20వ డివిజన్‌లకు సంబంధించిన బస్టాప్ 30 సంవత్సరాల నుంచి వినియోగంలో ఉందన్నారు. గత 4 నెలల నుంచి కొంతమంది బస్టాప్‌ను తొలగించి టిఫిన్ సెంటర్, టీ పాయింట్ తదితర వ్యాపారాలు కొనసాగిస్తున్నారని వివరించారు. దీని వల్ల బస్టాప్ లేక ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు మహేందర్, ఏసు, ఖాదరయ్య, రమణ, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించిన ఏఈ

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్ ప్రధాన రోడ్డుతో పాటు పలు అంతర్గత రోడ్ల పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. డ్రైనేజీ లైన్ కోసం రోడ్లను తవ్వి వదిలేయడంతో ఏడాది కాలంగా గిరినగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై 'సాక్షి' పలు కథనాలను ప్రచురించింది. ఇటీవల రూ.60 లక్షల నిధులతో రోడ్ల పనులకు శ్రీకారం చుట్టారు. మంగళవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ ఇంజినీరింగ్ సెక్షన్ ఏఈ స్వాతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ పనులను పరిశీలించారు. రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏఈ స్వాతి సదరు కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ఆమె వెంట స్థానిక నాయకులు కార్తీక్‌గౌడ్, రమేష్, శ్రీను, రాజు తదితరులు ఉన్నారు.



గిరినగర్‌లో బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ సెక్షన్ ఏఈ స్వాతి

మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నం

సుభాష్‌నగర్: మూడవ అంతస్తు నుంచి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సురారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శ్రీరామ్‌నగర్ కాలనీలో మంగళవారం ఉదయం బైక్‌పై వచ్చిన ఓ యువకుడు భవనం మూడో అంతస్తు ఎక్కి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. దూకిన వ్యక్తి చిట్టిబాబు (32)గా పోలీసులు గుర్తించారు. సదరు వ్యక్తి భవనంపై ఎక్కి దూకడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో భవన యజమాని కుటుంబ సభ్యులతో పరారయ్యాడు.



ఎంఎల్‌ఆర్‌ఐటీలో ముగిసిన 'ఏరోటాన్'



దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్‌ఆర్‌ఐటీ) కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన ఏరోటాన్ మంగళవారం ముగిసింది. వింగ్స్ అండ్ ఫూప్స్, ఐఏఏఏ ప్రొఫెషనల్ బాడీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మొత్తం 25 గ్రూపులు పాల్గొన్న ఏరోటాన్‌కు ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఏరోనాటికల్ విభాగం అధిపతి డాక్టర్ ఎం.ఎస్.ఎన్.గుప్తా, డీన్ రాధికదేవి, హ్యూమానిటీస్ అండ్ సైన్స్ విభాగం అధిపతి అచ్చిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సత్తాచాటిన శ్రీచైతన్య విద్యార్థులు



మెడల్స్, సర్టిఫికెట్లతో విద్యార్థులు

కుత్బుల్లాపూర్: దేశ వ్యాప్తంగా జరిగిన ఒలంపియాడ్ రెండవ లెవల్ పరీక్షలో దూలపల్లి బ్రాంచ్ శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 6 నుంచి 10వ తరగతి వరకు 135 మంది విద్యార్థులు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు, మరో 119మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్లు పొందారని కొంపల్లి జోన్ ఏజీఎం రమణారావు తెలిపారు. మెరిట్ సాధించిన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు భావన, హేమలత, జోన్ కో ఆర్డినేటర్ రవి, డీన్ శ్రీహరి సీ అండ్ ఎం ఇన్‌చార్జి కృష్ణంరాజు, ఎంపీఎల్ ఇన్‌చార్జి త్రివేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ పుష్పన్

జగద్గిరిగుట్ట: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ పుష్పన్ అన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు చాక్లెట్ల పేరుతో అందించే మత్తు పదార్థాలను తీసుకోకూడదని సూచించారు. సిగరెట్లు, గంజాయి, హుక్కా వంటి పదార్థాల వల్ల అనారోగ్యంతో పాటు కుటుంబ కలహాలు పెరుగుతాయన్నారు. ప్రతి విద్యార్థి మత్తు పదార్థాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని డ్రగ్స్ నిషేధిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుందన్నారు. జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ రాము నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో '2కే వాక్'

సాక్షి,సిటీబ్యూరో: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవంలో భాగంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం మైదానంలో అధికారులు, ఉద్యోగులు 2కే వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా మహిళల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు ఆర్బీఐ సూచనల మేరకు కలెక్టరేట్‌లో '2కే వాక్' నిర్వహించినట్లు చెప్పారు. మహిళా శ్రేయస్సు లక్ష్యంగా ఆర్థిక ప్రణాళిక, సూక్ష్మ పొదుపులు, నష్టాల తగ్గింపుపై దృష్టి సారించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికార వర్గాలు ప్రకటించాయి. ఆర్డీఓ హరిప్రియ, జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు వినోద్‌కుమార్, ఝాన్సీరాణి, స్వర్ణలత, సాంబశివరావు, రాంమ్మోహన్, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

చెరువులో శవమై తేలిన వృద్ధురాలు



లక్ష్మి(ఫైల్)

కుత్బుల్లాపూర్: అదృశ్యమైన వృద్ధురాలు చెరువులో శవమై తేలింది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గాజులరామారం చంద్రగిరిగనర్‌కు చెందిన బదాలి లక్ష్మి(59) ఈ నెల 22వ తేదీన రామిరెడ్డినగర్‌లోని తన తమ్ముడి ఇంటికి వచ్చి తప్పిపోయింది. మంగళవారం సుభాష్‌నగర్‌ను ఆనుకుని ఉన్న ఫాక్స్‌సాగర్ చెరువులో ఓ మహిళ మృతదేహం తేలిందని సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి లక్ష్మిగా గుర్తించారు. మతిస్థిమితం లేకపోవడంతో పాటు కల్లు తాగే అలవాటు ఉన్న లక్ష్మి మత్తులో ఫాక్స్‌సాగర్‌లో పడి మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి పైపులైన్ల పరిశీలన



చింతల్: వేసవి నేపథ్యంలో తాగునీటి సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని జలమండలి సుచిత్ర సెక్షన్ మేనేజర్ శివప్రసాద్ అన్నారు. మంగళవారం సెక్షన్ పరిధిలోని న్యూ వివేకానందనగర్, వెంకన్న హిల్స్‌లో తాగునీటి పైపులైన్‌లను లైన్‌మెన్లతో కలిసి పరిశీలించారు. సమయానికి తాగునీటిని విడుదల చేస్తున్నామని,ఫిర్యాదులు అందే ప్రాంతాల్లో పర్యటించి సమస్యను పరిష్కరిస్తామని మేనేజర్ శివప్రసాద్ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నిజాంపేట్ : గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 20వ తేదీన రాజీవ్ గృహకల్ప నుంచి ప్రగతినగర్ వైపుకు వెళ్లే దారిలో హారిక ఫస్ట్ ఎయిడ్ సెంటర్ వద్ద సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ గుర్తు తెలియని వ్యక్తి తాగిన మైకంలో రోడ్డు పక్కన పడి ఉన్నాడు. మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రాజీవ్ గృహకల్పలో నివాసం ఉండే అంజూరు సురేశ్ కుమార్ ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అతని ఎత్తు 5 ఫీట్లు, నలుపు రంగు, గ్రీన్‌కలర్ షర్ట్, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు.

ఉమామహేశ్వర ఆలయంలో రుద్రయాగం

సుభాష్‌నగర్: శివరాత్రి పండగను పురస్కరించుకొని సూరారంలోని ఉమామహేశ్వర ఆలయాన్ని వివిధ రంగులతో కూడిన లైట్లతో ముస్తాబు చేశారు. మంగళవారం రుద్ర యాగాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి సీఐ భరత్ కుమార్ ముఖ్య అతిథి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఉదయం అభిషేకం, పాలాభిషేకం, లింగోద్భవ మహా పూజ, రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము 5 గంటల వరకు జాగారణ, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న అన్నదాన కార్యక్రమం, 28న పవళింపు సేవ ఉంటుందని ఆలయ ధర్మకర్త మదన్‌గౌడ్ తెలిపారు. ప్రతి ఏటా పెరుగుతున్న భక్తులను దృష్టిలో పెట్టుకొని అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.



పూజల్లో పాల్గొన్న సీఐ భరత్‌కుమార్

ఆలయాల్లో నేడు శివరాత్రి పూజలు

నిజాంపేట్ : మహాశివరాత్రి సందర్భంగా బుధవారం వివిధ ఆలయాల్లో శివరాత్రి పూజలు నిర్వహించనున్నారు. నిజాంపేట్ బండారీ లేఅవుట్‌లోని దక్షిణముఖ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి అమరలింగేశ్వరునికి సామూహిక పంచామృత అభిషేక పూజలు, సాయంత్రం 6 గంటలకు అన్నాభిషేకం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, 7:30 గంటలకు ఎదుర్కోలు, ఉత్సవ మూర్తులకు సేవాకాలం , రాత్రి 12 గంటల నుంచి స్వామివార్లకు లింగోద్భవకలంలో కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చలన చిత్ర అభివృద్ధి సంస్థ సౌజన్యంతో రామకృష్ణా నాట్య మండలి నిర్వహణలో సాయంత్రం 6గంటలకు శివ అనుగ్రహం అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం, అక్షయ కృతి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థులచే నృత్య ప్రదర్శనలు, సత్యహరిశ్చంద్ర నాటకం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.





ముస్తాబైన సూరారం ఉమామహేశ్వర ఆలయం, ప్రధాన రోడ్డులో ఏర్పాటు చేసిన లైటింగ్

బాలుడిని ఎత్తుకెళ్లిన వ్యక్తుల రిమాండ్

• పిల్లలు లేరని బాబుని అపహరణ
• పోలీసులు దర్యాప్తులో వెల్లడి

జీడిమెట్ల: ఫుట్‌పాత్‌పై తల్లిదండ్రుల వద్ద నిద్రిస్తున్న బాలుడిని ఎత్తుకెళ్లిన కేసులో సనత్‌నగర్ పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం బాలానగర్ డీసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో డీసీపీ కె.సురేష్‌కుమార్ ఏసీపీ హన్మంతరావు, సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. కలివెల గీత, రాధేయ భార్యాభర్తలు సనత్‌నగర్‌లో స్క్రాప్ ఏరుకుని జీవనం సాగిస్తుంటారు. ఎప్పటిలాగే ఈనెల 23వ తేదీన వారు తమ 8 నెలల బాబుతో శివాలయం రోడ్డులోని ఫుట్‌పాత్‌పై నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి తర్వాత లేచి చూసేసరికి బాబు కనిపించలేదు. దీంతో వారు సనత్‌నగర్ పోలీసులు ఫిర్యాదు చేశారు. అనంతరం డీసీపీ పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. నిందితులు ముందుగానే పాలడబ్బా కొన్నట్టుగా గుర్తించారు. ఈ కోణంలో విచారణ జరపగా.. బిహార్‌కు చెందిన భార్యాభర్తలు సత్యనారాయణ, శోభాదేవిలకు పిల్లలు లేరు. దంపతులు ఫుట్‌పాత్‌పై పసికందుతో పడుకోవడాన్ని గమనించి బాబును ఎత్తుకెళ్లాలని ప్లాన్ చేశారు. అనుకున్నట్లుగానే సత్యనారాయణ, అతని అనుచరుడు సన్నికుమార్ పాండేతో కలిసి ఈనెల 23వ తేదీన బాలుడిని ఎత్తుకెళ్లారు. సత్యనారాయణ, శోభాదేవి దంపతుల వద్ద నుంచి బాబును పోలీసులు స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. సత్యనారాయణ, సన్నికుమార్ పాండేలను మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను డీసీపీ అభినందించారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్